# 4. పితృహృదయం

అతనికి విద్యాశాఖ ఆఫీసులో పని. ప్రతి ఉదయం పెద్ద బస్సులో ఎక్కి ఆఫీసుకు వెళ్ళేవాడు. అతను బస్సులో తనకు ఎదురుగా కూర్చునే ఆమెను ప్రేమించాడు.

ఆమెకు ఒక షాపులో పని. సరిగ్గా అతను వెళ్ళే వేళకే ఆమె కూడా వెళ్ళేది. ఆమె కాస్త లావుగానే వుంటుంది. ఆమె కళ్ళు ఎంత నల్లగా వుంటాయంటే ముఖంలో ఏవో మచ్చలల్లే కనిపిస్తాయి. శరీరచ్ఛాయ మాత్రం ఏనుగుదంతమల్లే తెల్లగా వుంటుంది. ప్రతి ఉదయమూ అదే వీధి మూల నుండి ఆమె వచ్చేది. సామాన్యంగా ఆమె పరుగెత్తుకుంటూ వచ్చి పూర్తిగా ఆగకపూర్వమే ఎగిరి ఎక్కుతుంది. చకచకా వచ్చి కూర్చున్నాక కాని బిగపట్టిన ఊపిరి వదలదు. ఆ తరువాత తనచుట్టూ కలయచూస్తుంది.

ఆమెను మొట్టమొదటిసారి చూడగానే ఫ్రాంకాయిస్‌కు ఆమె ముఖం ముద్దులమూటగా తోచింది. ఒకోసారి ఒకో స్త్రీని చూడగానే, ఆమె ఎంత అపరిచితురాలైనాసరే ఆమెను బాహువుల్లో బంధించాలనే గాఢవాంఛ కలుగుతూ వుంటుంది. అతని రహస్యవాంఛలకు, హృదయంలోని ఆశలకు ఆమె తగినట్టుగానే జవాబిచ్చింది!

ఆమె ఏమనుకుంటుందోననే ఆలోచన కూడా లేకుండా తదేకంగా ఆమెను చూసేవాడు. ఆమె ఆ వాడి చూపుల వేడికి తట్టుకోలేకపోయింది. ఆమె ఇబ్బందిని గ్రహించి తన చూపులను వేరొక దిక్కుకు మార్చుకోవాలని అతను అనుకునేవాడు. కాని ఎంత ప్రయత్నించినా ఆ చూపుల్ని ఆమె నుంచి తిప్పుకోలేకపోయేవాడు. ఈ విధంగా కొన్నాళ్ళు గడిచేటప్పటికి ఒకరికొకరు బాగా అలవాటయ్యారు. ఒక్కమాటన్నా

మాట్లాడుకోకుండానే ఒకర్నొకరు బాగా ఎరిగిన వాళ్ళయ్యారు. ఒక్కోసారి బస్సులో కూర్చోవటానికి చోటు లేనట్లయితే, అతను లేచి తన చోటును ఆమెకు ఇచ్చేవాడు. ఇలా చేయటం తనకు బాధగా వున్నా లెక్క చేసేవాడు కాదు. తనపట్ల అతను చూపిన అభిమానానికి ఆమె ఒక చిరునవ్వు ద్వారా తన కృతజ్ఞతను తెలియపరిచేది. అతని చూపులకు తన కనురెప్పలు వాలినా, ఆమె బాధపడేది కాదు.

ఈ రకం మూగప్రేమ, వాళ్ళు మాట్లాడుకోవటం మొదలెట్టగానే అంతమైంది. వారి స్నేహం చాలా వేగంగా పెరగసాగింది. ప్రతిరోజూ ఒక అరగంటసేపు మాట్లాడుకునేవారు. ఇలాటి అరగంటలే తన జీవితంలో ఎంతో విలువైనవని అతని నమ్మకం. అయితే ఆమెను చూస్తూ మాట్లాడిన అరగంట తాలూకు జ్ఞాపకం, అతని మిగతా కాలమంతా వెంటాడేది. ఆఫీసులో పనిచేస్తూన్నంతసేపు ఆమె రూపమే అతని కళ్ళముందు వేళ్ళాడుతుంది. గాఢంగా ప్రేమించిన వ్యక్తి తాలూకు ప్రతి చిన్న కదలికా ఒక పిచ్చి ఆనందాన్నిస్తుంది. ఇక ఆమె తనదైననాడు మానవుడు వూహించలేని ఆనందమే తనకు కరతలామలకమౌతుంది.

ప్రతి ఉదయమూ ఆమె అతనితో కరచాలనం చేస్తుంది. ఆమె మృదువైన హస్తాన్ని, మెత్తని వేళ్ళ స్పర్శసుఖాన్ని అతను మర్నాటి ఉదయం వరకూ జ్ఞాపకం ఉంచుకుంటాడు. తన హస్తం మీద ఆమె హస్తం వేసిన ముద్రను ప్రాణపదంగా దాచుకొని, మర్నాటి బస్సుకోసం ఆతృతగా వేచి వుంటాడు. ఆదివారాలు జీవితంలో దుర్దినాలుగానే అతనికి తోస్తవి. ఏమైనా ఆమె తనను ప్రేమిస్తోందనేందుకు సందేహం లేదు. ఎందుకంటే వసంతకాలంలోని ఒక ఆదివారం నాడు తనతోపాటు భోజనం చేసేందుకు ఆమె అంగీకరించింది!

## 2

ఆమే ముందుగా రైల్వేస్టేషన్‌కు వచ్చినందుకు అతను ఆశ్చర్యపడ్డాడు.

“బయలుదేరే ముందు నేను నీతో మాట్లాడాలి. మనకింకా ఇరవై నిమిషాల వ్యవధి వుంది. ఈలోగా నే చెప్పదలచుకున్నది ముగించగలుగుతాను” అందామె.

అతని చేతి మీద వాలినప్పుడామె వొణికిపోయింది. ఆమె నేలచూపులు చూడసాగింది. ఆమె చెక్కిళ్ళు తెల్లబడినాయ్. అయినప్పటికీ ఆమె మాట్లాడింది: “నావల్ల నీవు మోసపోకూడదు. అక్కడ అసభ్యంగా ప్రవర్తించనని నాకు వాగ్దానం కాదు ప్రమాణం చేస్తేనే కాని నేను రాలేను.”

హఠాత్తుగా ఆమె ముఖం కందగడ్డయింది. ఆమె మరి మాట్లాడలేకపోయింది. ఏం జవాబు చెప్పాలో అతనికి తోచలేదు. ఒక పక్క ఆనందమూ, రెండోవైపున నిరాశా అతన్ని వేధించసాగాయి. హృదయాంతరాళంలో మాత్రం ఆమె చెప్పిన విధంగానే

అవుగాక అని అతను కోరాడు. కాని గతరాత్రి అతను ఎన్నో గాలిమేడల్ని కట్టుకొని రాబోయే మధురతమ క్షణాల కోసం ఆతృతతో వేచి కూర్చున్నాడు. ఆ తీయని తలపులన్నీ అతని శరీరంలోని ప్రతి రక్త అణువునూ ఉడికెత్తించినవి... తను ఇంకాస్త తక్కువగా ఆమెను ప్రేమించి ఉండవలసింది! ఇలా జరుగుతుందని ముందుగా తెలియనందువల్ల పొరపాటు పడ్డాడు. ఇలా జరిగినప్పటికీ తన ప్రణయం తక్కువ మోతాదులోనే ఎక్కువ ఆనందాన్ని ఇచ్చి వుండేది. పురుషుడు స్వార్థంతో పెంచుకునే ఆశల వలలో తను కూడా ఇరుక్కున్నాడు!

అతనేమీ మాట్లాడకపోయేటప్పటికి ఆమె చాలా ఆందోళనపడింది. అందమైన ఆమె కళ్ళల్లో నీళ్ళూరినవి. ఆమె అంది: “నన్ను గౌరవంగా చూస్తానని వాగ్దానం చేయనట్లయితే నేను తిరిగి ఇంటికి వెళ్ళిపోతాను.”

ఆమె చేతిని మృదువుగా స్పర్శిస్తూ అతను జవాబిచ్చాడు: “నీకు ఎలా ఇష్టమో అలాగే చేయి. నేనేమీ అభ్యంతరం చెప్పను.”

ఆమె మనస్సు తేలికపడింది. “నిజంగానా?” అని చిరునవ్వుతో అడిగింది.

అతను ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ “నేను ప్రమాణం చేస్తున్నాను” అన్నాడు.

“అయితే టిక్కెట్లు తీసుకో” అందామె.

ప్రయాణంలో వాళ్ళు దాదాపు ఏమీ మాట్లాడలేదు. పెట్టెలో జనం కిటకిటలాడటమే ఇందుకు కారణం. రైలు దిగాక వాళ్ళు హోటల్‌వైపు నడవసాగారు.

సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. నదిలోని నీటి మీద సూర్యకిరణాలు పడి, కదిలే నీటికి ఎంతో కాంతి నిస్తున్నవి. సూర్యుని ప్రకాశమే తమ హృదయాల్లో ప్రతిఫలిస్తూన్నట్లుగా వాళ్ళిద్దరికీ తోచింది. చేతులు కలిపి వారు నది ఒడ్డునే నడవసాగారు. తేలికైన మనసులవల్ల నీటికింద చేపలు పైకి తేలిపోతున్నట్లున్నయ్. ఆనందంతో ఈదులాడే చేపల్ని చూస్తూ వాళ్ళు కాసేపు మైమరిచారు.

చివరకు ఆమె అంది. “నేను మూర్ఖురాల్ని అని మీరు అనుకుంటారు కదూ?”

“ఎందుకనీ?”

“ఈ విధంగా ఒంటరిగా మీతో రావటం?”

“ఛ! ఛ! ఎప్పుడూ అపార్థం చేసుకోను. ఇలా రావటం చాలా సామాన్యమైన విషయం.”

“కాదు... నా విషయంలో సామాన్యమైనది మాత్రం కాదు. తప్పు చేయాలని నాకు లేదు. ఐతేనేం ఈ విధంగానే ఆడపిల్లలు పతనమౌతూంటారు. చూడండి ప్రతిరోజూ ఒకే వాతావరణం, ఒకే ప్రవర్తన, ప్రతినెలా అంతే, ప్రతి సంవత్సరమూ అదేవిధంగా గడుస్తుంది. బతుకులో మార్పు లేకుంటే ఎంత భారమౌతుందో! నేనూ

అమ్మా వుంటున్నాం. ఆమెకు ఎంతో పని. అందుకని ఆమె ముఖంలో బడలిక తప్ప ఆనందం కనిపించదు. జరుగుతూన్న దంతా మరిచిపోయి నవ్వుదామని, అమ్మను నవ్విద్దామని ఎంతో ప్రయత్నిస్తాను. కాని ప్రతి ప్రయత్నంలోనూ నెగ్గలేను. మీకు విచారంగా లేకపోయినా– నేను చేసింది చాలా పెద్ద తప్పు" అందామె.

ఆమెకు జవాబుగా ఆమె చెవిని ముద్దుపెట్టుకున్నాడు. హఠాత్తుగా ఆమె దూరంగా జరిగి కోపంతో అంది: "నాకు ప్రమాణం చేశాక ఇదా చేసేపని?"

అతను జవాబు చెప్పలేదు. బహుశా సిగ్గుపడ్డాడేమో? నదివొడ్డునే వున్న హోటల్‌కు వెళ్ళారు. పెద్ద పెద్ద చెట్ల నీడల్లో భోజనం చేశారు. వాతావరణం ఎంతో ప్రశాంతంగా అందంగా, ఆనందంగా వుంది. వారిద్దరూ ఒకరికొకరు దగ్గరగా వున్నామనే భావన ఇద్దర్నీ మాట్లాడలేనట్లుగా చేసింది. ఏదో పెద్ద బరువు మీదపడ్డంత బాధలో ముంచింది. చివరకు కాఫీ తాగాక కాని ఆ మత్తంతా వదలలేదు. భోజనమయ్యాక దగ్గర్నేవున్న ఒక చిన్న గ్రామం వైపు నదిఒడ్డునే నడవసాగారు.

ఉన్నట్లుండి అతను అడిగాడు: "అన్నట్లు నీపేరేమిటి?"

"లూసీ."

'లూసీ' అని గొణుక్కుని వూరుకున్నాడు.

నది పెద్దవంకర తిరిగింది. మలుపులో వున్న ఇళ్ళ ప్రతిబింబాలు నదిలో స్పష్టంగా కనిపిస్తున్నవి. నదిఒడ్డునే వున్న రకరకాల పూలను ఆమె ఏరింది. ఆనందంతో అతను పాటలు పాడాడు. ఎడమచేతివైపు ఒక పెద్ద ద్రాక్షతోట వుంది. ఫ్రాంకాయిస్ ఆమెను ఆపి "చూడు ఆ తోట పల్లంలోకి ఎలా దిగజారిందో!" అన్నాడు.

ద్రాక్షపూలతో కప్పబడిన భూమల్లే వుందా తోట! దాదాపు రెండుమైళ్ళ వరకూ ఒక తివాసీ పరిచినట్లుగానే వుంది. ఆమె కూడా ఆశ్చర్యంలో మూగవోయింది. 'ఎంత బాగుందీ!' అని గొణిగింది. వారు మెల్లిగా పచ్చిక బయలును దాటి చిన్నకొండవైపు నడవసాగారు.

ఒక సన్నని దారిగుండా నడిచారు. దారిచివర పచ్చిక మీద కూలబడ్డారు. దగ్గర్లో తుమ్మెదలు ఝుమ్మని తిరుగుతున్నవి. మృదువైన శబ్దం కమ్మని సంగీతాన్ని సమకూరుస్తోంది. అడివి పూలవాసన మత్తెక్కిస్తోంది.

దూరంగా చర్చ్ మీది గడియారం గంటల్ని కొట్టింది. వారు మృదువుగా కావలించుకున్నారు. ఆ తరువాత వారి బాహువులు బిగిసినవి. క్రమంగా గడ్డిమీద పడుకున్నారు. వారికి ముద్దును గూర్చిన తలపు తప్ప వేరొక దృష్టి కాదు. ఆమె కళ్ళుమూసి అతన్ని తన చేతులతో గట్టిగా పట్టుకొని తన వైపు లాక్కుంది. ఆమెకు మతిపోయినట్లయింది. వేరొక ఆలోచన ఆమెకు లేదు. ఏదో ఆనందాన్ని మాత్రమే

ఆశిస్తూ ఆతృతతో వణికిపోతూ వుండిపోయింది. తను లొంగిపోతూన్నట్లు తెలుసుకోలేకుండానే ఆమె లొంగిపోయింది. ఆ ఉద్రేకంలో ఆమెకు మరేమీ తోచలేదు.

కాని త్వరలోనే ఆమె తన స్థితిని గ్రహించగలిగింది. ఎంత దురదృష్టానికి తాను గురైందో, ఎంత గొప్పతప్పుకు ఒడిగట్టిందో ఆమె తెలుసుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తూ ఆమె తన ముఖాన్ని చేతుల్లో దాచుకుంది.

అతను ఆమెను ఓదార్చేందుకు ప్రయత్నించాడు. వెంటనే ఇంటికి తిరిగి వెళ్ళాలని ఆమె పట్టుబట్టింది. ఆమె నడుస్తూ 'భగవాన్! భగవాన్!' అని బాధపడుతూనే వుంది.

అతను అన్నాడు: "లూసీ! లూసీ! మనం ఇక్కడ ఆగుదాం."

ఆమె చెక్కిళ్ళు ఎర్రబడినవి. ఆమె కళ్ళు శూన్యదృక్కుల్ని ప్రసరించినవి. చివరకు పారిస్‌లో రైలు దిగగానే వెళ్ళొస్తానని చెప్పనైనా చెప్పకుండా ఆమె అతన్ని వదిలి చకచకా నడిచి వెళ్ళింది.

## 3

మర్నాడు ఫ్రాంకాయిస్ ఆమెను బస్సులో కలుసుకున్నాడు. ఆమె చిక్కిపోయినట్లూ, ఎంతగానో మారిపోయినట్లూ కనిపించింది.

"మీతో కాస్త మాట్లాడాలి. మనం బౌలివార్ట్ దగ్గర ఆగుదాం" అందామె.

బస్సు దిగగానే ఆమె అంది. "మనం మళ్ళీ కలుసుకోరాదు. సెలవు తీసుకునేందుకే దిగమన్నాను."

"అది సరే... ఎందుకని కలుసుకోరాదు?"

"నేను కలుసుకోలేను. ఏదో నేరం జరిగిపోయింది. అదే నేరాన్ని తిరిగి చేయలేను."

ఆ తరువాత అతను ఆమెను బతిమాలాడు; ప్రార్థించాడు. సర్వస్వతంత్రంగా ఆమెను తనదాన్ని చేసుకోవాలనే పిచ్చికోర్కెతో ఆమెకు అనేకవిధాల చెప్పి చూశాడు. కాని ఆమె నిశ్చయ కంఠస్వరంతో అతని ప్రార్థనల్ని తోసిపుచ్చింది.

ఆమె నిరాకరించిన కొద్దీ అతని వాంఛ గాఢతమ మవసాగింది. విలువైన వస్తువు చేయిజారి పోతూన్నంత బాధకలిగింది. చివరకు ఆమెను పెళ్ళిచేసుకుంటానని వాగ్దానం చేశాడు. కాని ఆమె అందుకూ ఒప్పుకోలేదు. అతని మాటల్ని వినకుండానే అతన్ని విడిచి వెళ్ళిపోయింది.

ఒక వారంగా అతనామెను చూడలేకపోయాడు. ఆమె చిరునామా అతనికి తెలియదు. ఆమె చేయిజారిపోయిందనే నిశ్చితాభిప్రాయం ఏర్పడింది. తొమ్మిదోరోజున

కాబోలు అతని ఇంటి తలుపు ఎవరో తట్టారు. తీరా తలుపు తీశాక ఎదురుగా ఆమె నిలబడి వుంది! ఆమె ఈసారి ఎలాంటి కఠినత్వాన్నీ ప్రదర్శించలేదు. వెంటనే అతని చేతుల్లోకి వాలిపోయింది. ఈ విధంగా మూడు నెలల పాటు వారు ఏక శరీరులుగానే గడిపారు.

ఆమెపట్ల అతని ప్రేమంతా క్రమంగా ద్వేషంగా మారసాగింది. ఎలాగైనా ఈమెను వదిలించుకుంటే బాగుంటుందనిపించింది. చివరకు ఆమె గర్భాన్ని ధరించానని చెప్పినప్పుడు అతనికి మతిపోయి నట్లయింది. ఆమెతో మరి జీవించటం అసంభవమనిపించింది. కాని వదిలించుకోవటం అంత తేలిగ్గా అతనికి కనిపించలేదు. ఎలా మాట్లాడాలో అతనికి తెలియలేదు. పైగా ఆతృత అతన్ని వేధించసాగింది. ఏమీ తోచక ఒకానొక అర్ధరాత్రి అతను ఇల్లు మార్చివేశాడు.

ఈ దెబ్బకు ఆమె తట్టుకోలేకపోయింది. తల్లి పాదాల మీదపడి తన తప్పును ఒప్పుకుంది. కొన్ని నెలలయ్యాక ఒక మగబిడ్డను ప్రసవించింది.

## 4

సంవత్సరాలు గడిచినవి. ఫ్రాంకాయిస్ పెద్ద మార్పులేమీ లేకుండానే దాదాపు ముసలివాడయ్యాడు. జీవితంలో ఉత్సాహమే లేదు. ఏ ఆశలూ లేకుండానే రోజుల్ని దొర్లిస్తున్నాడు. ప్రతిరోజూ ఒకేవేళకు నిద్రలేవటం, అదే వీధుల్లోనుంచి నడవటం, ఆ మనుషుల్తోనే మాట్లాడటం, అదే ఆఫీసు పనిని చెయ్యటం, తిరిగి బరువుగా కాళ్ళను యీడ్చుకుంటూ ఇంటికి జేరటం - ఇలా మార్పులేని జీవిత సాగరంలో పడికొట్టుకుంటున్నాడు. అతనికి ఎవ్వరూ లేరు. ఒంటరిగానే బతుకుతున్నాడు. ఎంతమంది మధ్యలో వున్నప్పటికీ అతను ఒంటరివాడే! రాత్రులు ఒంటరిగా పడుకొని బాధపడేవాడు.

ప్రతి ఆదివారమూ పార్క్‌కు వెళ్ళేవాడు. ఎన్నో బళ్ళు- అందమైన బళ్ళు వొచ్చేవి. వాటిల్లోనుంచి ఎంత అందమైన, నాజూకైన మనుషులు దిగి పార్క్‌లో విహరించే వాళ్ళు. ఆ మనుషుల ముఖాల్లో ఆనందం తప్ప మరేమీ కనిపించదు. వాళ్ళందర్నీ చూస్తూ తన దురదృష్టాన్ని నిందించుకుంటూ సాయంత్రమంతా గడిపేవాడు.

ఒక ఆదివారం ఉదయం సముద్రపుటొడ్డుకు వెళ్ళాడు. అక్కడికి దగ్గర్లోనే పిల్లలు ఆడుకునే పార్క్ వున్నది. తల్లులు తమ పిల్లల ఆటల్ని చూస్తూ ఆనందిస్తూ వుంటారు. అతను కూర్చొని ఉండగా ఒకామె ఇద్దరు పిల్లల్ని- ఒక పదేళ్ళ కుర్రాణ్ని, ఒక నాలుగేళ్ళ ఆడపిల్లనూ చెరో చేత్తోనూ నడిపించుకుంటూ అతని పక్కనుంచే వెళ్ళింది. అతను దిమ్మెరపోయాడు. ఆమె... ఆమే!

అతికష్టం మీద ఒక వంద గజాలు నడవ గలిగాడు. ఉద్రేకంతో గొంతు ఎండిపోయినట్లయి అక్కడే కూలబడ్డాడు. ఆమె అతన్ని గుర్తించలేదు. అందుకని ఆమెను మళ్ళీ చూడాలనిపించింది. మెల్లిగా వెనక్కు వచ్చాడు. ఆమె కూర్చుని వుంది. ఆమె పక్కనే కుర్రవాడు నిశ్శబ్దంగా నిలబడి వున్నాడు. ఆడపిల్ల ఇసుకతో పిచ్చికగూళ్ళను కడుతోంది.

ఆమె... ఆమే ననేందుకు సందేహం లేదు. కాని ఆమె ఎంతో గౌరవనీయురాలైన ఇల్లాలివలె కనిపిస్తోంది. వస్త్రధారణ నిరాడంబరంగా వుంది. ముఖంలో మంచి హుందాతనం కనిపిస్తోంది. కొద్దిదూరం నుంచి ఆమెను చూడసాగాడు. దగ్గరిగా వెళ్ళేందుకు అతనికి భయం వేసింది. కుర్రాడు తల ఎత్తగానే ఫ్రాంకాయిస్ వణికిపోయాడు.

వాడు... ఆ కుర్రాడు.... తన కొడుకేననేందుకు సందేహం లేదు. వాడి ముఖంలోకి చూస్తుంటే చాలా చిన్నతనంలో తను తీయించుకున్న ఫోటోను గుర్తుపట్టినట్లయింది. ఒక చెట్టుపక్కగా, ఆమెకు కనిపించకుండా దాక్కున్నాడు- ఆమెను అనుసరిద్దామనే నిశ్చయంతో.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. ఆ కుర్రవాడి తలపు అతన్ని వేధించసాగింది. తన కొడుకు! ఇది నిజమేనని తను నిశ్చయంగా తెలుసుకోగలుగుతే! కాని తెలుసుకొని తను ఏం చేయగలడు? ఏమైనా ఆమె పూర్వం నివసించిన ఇంటి దగ్గరకు వెళ్ళి విచారించాడు. ఇరుగున వున్న ఒక నీతిపరుడైన పెద్దమనిషి ఆమె దురదృష్టానికి సానుభూతి చూపి ఆమెను వివాహమాడినట్లుగా తెలుసుకున్నాడు. అంటే ఆమె చేసిన తప్పును క్షమించాడు. ఆమె తనను కన్నకొడుకుని స్వసంతానంగానే స్వీకరించిన విశాలహృదయుడు!

అది మొదలు అతను ప్రతి ఆదివారం ఉదయమూ సముద్రపు టొడ్డుకు తప్పనిసరిగా వెళ్ళేవాడు. అక్కడ ఆమె తప్పకుండా కనిపించేది- కాదు... తన కొడుకు కనిపించేవాడు. వాణ్ణి చూసినప్పుడల్లా కావలించుకోవాలని, వాణ్ణి ఎత్తుకొని తిప్పాలని, వూపిరాడకుండా వాణ్ణి ముద్దుల్లో ముంచివేయాలని, వాణ్ణి దొంగిలించాలనే తీవ్రవాంఛ అతన్ని వేధించేది.

ఒంటరితనంతో పాటు అతని పితృహృదయం కూడా బాధించసాగింది. తనపట్ల సానుభూతి చూపేవాళ్ళెవ్వరూ లేరు. ప్రకృతి ఏర్పరచిన సంతానానుబంధాన్ని మరిచిపోలేని అశక్తతతో ఎంతో బాధపడేవాడు. చివరకు అతని వాంఛ తీవ్రరూపం దాల్చింది. తెగించి వెళ్ళి ఆమె దారికి అడ్డంగా నిలిచి "నీవు నన్ను గుర్తించలేదు" అన్నాడు.

ఆమె కళ్ళెత్తి చూసింది. భయంతో మూగవోయింది. చప్పున తేరుకుని ఇద్దరు పిల్లల్నీ బరబరా ఈడ్చుకుంటూ వెళ్ళిపోయింది. ఈ ఆశ కూడా విఫలమవటం వల్ల అతను ఇంటికి వెళ్ళి విలపించాడు.

ఆమెను చూడకుండానే కొన్ని నెలలు గడిచినవి. పితృహృదయం తాలూకు ఆరాటంతో అతని మనశ్శాంతి పూర్తిగా భగ్నమైంది. ఒక్కసారి తన కొడుకును ముద్దాడాక మృత్యువును కూడా ఆనందంతో ఆహ్వానించగలడు. ఎంత అపాయాన్నయినా ఎదుర్కోగలడు. చివరకు ఖూనీ చేయాలన్నా వెనుకాడడు. ఒక్కసారి తన సంతానాన్ని ముద్దాడే అవకాశం కోసం!

ఆమెకు ఉత్తరాలు రాశాడు. కాని ఆమె జవాబీయలేదు. ఇరవై ఉత్తరాలు రాశాక ఆ ఆశలు కూడా వదులుకున్నాడు. చివరకు తెగించి ఆమె భర్తకే ఉత్తరం రాసేందుకు సిద్ధపడ్డాడు. ఆమె భర్త నుంచి తుపాకీగుండు తనను ఎదుర్కొన్నా ఫర్వాలేదనుకున్నాడు. ఈ క్రింది విధంగా ఉత్తరం రాశాడు.

'అయ్యా!

నాపేరు మీకు కర్ణకఠోరంగా ఉండొచ్చు. కాని నా అభాగ్యతకు, బాధకు వేరొకమార్గం లేదు. మీమీదనే నా జీవితపుటాశలన్నిటినీ కేంద్రీకరించుకున్నాను. ఒక్క ఐదు నిమిషాలపాటు నాకు ఇంటర్వ్యూ ఇమ్మని ప్రార్థిస్తున్నాను."

మర్నాడు అతని ఉత్తరానికి జవాబొచ్చింది.

"అయ్యా! రేపు మంగళవారం సాయంత్రం ఐదుగంటలకు మీ కోసం ఎదురుచూస్తుంటాను."

## 5

మేడమెట్లు ఎక్కుతున్నప్పుడు అతని గుండె ఎంతో వేగంగా కొట్టుకోసాగింది. చాలాసార్లు మెట్లమీదనే నిలబడిపోవాల్సి వచ్చింది. ఏవో గుర్రాలు పరుగెత్తుతూన్న చప్పుడు లాటిది అతని గుండెల్లోనుంచి వెలువడుతున్నట్లనిపించింది. ఊపిరి పీల్చటం కూడా చాలా కష్టమనిపించింది. కిందికి పడకుండా కొయ్యఫ్రేమును గట్టిగా పట్టుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

మూడో అంతస్తులో గంట మోగించాడు. ఒక పనిమనిషి తలుపు తీయగానే "మాన్షియర్ ఫ్లామెల్ నివసించేది ఇక్కడేనా?" అని అడిగాడు.

"ఔను. లోనికి దయచేయండి."

పనిమనిషి అతన్ని డ్రాయింగ్‌రూంలోకి తీసుకొని వెళ్ళింది. కొంచెంసేపు అతను ఒంటరిగానే ఉండిపోయాడు. ఏదో గొప్ప ప్రమాదం క్షణాల్లో సంభవించబోతోందన్న భయం అతన్ని ఆవరించింది. దాదాపు శిలాప్రతిమవలె నిలబడిపోయాడు.

కొంచెంసేపట్లో తలుపు తెరువబడింది. పొడుగ్గానూ, బలిష్టంగానూ వున్న ఒకాయన ప్రవేశించి, ఫ్రాంకాయిస్‌కు కుర్చీ చూపాడు. ఫ్రాంకాయిస్ కూర్చొని ఎండుకుపోతున్న కంఠస్వరంతో అన్నాడు: "మాన్షియర్... మాన్షియర్! నా పేరు... మీకు తెలుసో లేదో నాకు తెలియదు."

ఫ్లామెల్ మాట మధ్యలోనే అందుకున్నాడు. "ఆ సంగతులన్నీ నాకు చెప్పవలసిన అవసరం లేదు. అంతా నాకు తెలుసు. నా భార్య ఆ విషయాలన్నీ నాతో మాట్లాడింది." ఈ మాటల్లో ఎంతో హుందాతనం వుంది. దాపరికం లేదు. పెద్దమనిషి మాట్లాడవలసిన రీతిగానే వుంది.

ఫ్రాంకాయిస్ అన్నాడు. "సరే.... నేను దుఃఖంతో కుంగిపోతున్నాను. సిగ్గుతో చచ్చిపోతున్నాను. నాకు ఒక్కటే కోర్కె వుంది. కుర్రాణ్ణి ఒక్కసారి ముద్దుపెట్టుకోవాలని!"

ఫ్లామెల్ లేచి గంట మోగించాడు. పనిమనిషి రాగానే "లూయీని ఒక్కసారి ఇక్కడికి తీసుకొనిరా" అన్నాడు.

పనిమనిషి వెళ్ళిపోగానే వాళ్ళిద్దరూ ఒకరి కొకరు ఎదురుగా ఉండిపోయారు. ఒక్కమాటన్నా మాట్లాడలేదు. బహుశా మాట్లాడుకోవాల్సింది ఏమీ లేదేమో?

హఠాత్తుగా పదేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొని గదిలోకి వచ్చాడు. తాను ఎవర్నయితే తన తండ్రి అని భ్రమిస్తున్నాడో అతని దగ్గరికి చరచరా వెళ్ళసాగాడు. కాని వేరొక మనిషి గదిలో వున్నట్టు తెలుసుకోగానే కుర్రాడు ఆగిపోయాడు.

ఫ్లామెల్ కుర్రాణ్ణి ముద్దుపెట్టుకొని "వెళ్ళి ఆ పెద్దమనిషిని ముద్దుపెట్టుకో నాయనా!" అన్నాడు. కుర్రాడు మారు మాట్లాడకుండా ఫ్రాంకాయిస్ దగ్గరికి వెళ్ళి అతనివైపు చూశాడు.

ఫ్రాంకాయిస్ లేచి నిలబడ్డాడు. అతని టోపీ క్రిందపడిపోయిన సంగతి కూడా గ్రహించలేదు. కుర్రాడివైపు చూస్తుంటే ఒళ్ళుతూలి క్రిందపడిపోయే పర్యంతమై ఎలాగో నిలదొక్కుకున్నాడు. ఈ దృశ్యంలోని ఇబ్బందిని గ్రహించి ఫ్లామెల్ కిటికీలోంచి కిందికి చూడసాగాడు.

కుర్రాడికి చాలా ఆశ్చర్యమైంది. కిందపడిపోయిన టోపీని తీసి ఫ్రాంకాయిస్‌కు అందించాడు. ఫ్రాంకాయిస్ కుర్రాణ్ణి ఎత్తుకొని అతని ముఖంమీద, కళ్ళమీద, పెదవుల మీద, చెక్కిళ్ళమీద తలమీద ముద్దులవర్షాన్ని కురిపించాడు. ఈ తాకిడికి తట్టుకోలేక కుర్రాడు తలను త్రిప్పి వేసి ఆగంతకుడి తలను చేతులతో అవతలికి నెట్టివేయసాగాడు. ఫ్రాంకాయిస్ చప్పున కుర్రాణ్ణి కిందకి దింపేశాడు. 'గుడ్‌బై...గుడ్‌బై...' అని దొంగతనం చేసి తప్పించుకొని వెళ్ళేందుకు ప్రయత్నించే దొంగలల్లే చకచకా నడుస్తూ గదిలోనుంచి బైటపడ్డాడు.